క్లుప్తంగా

పెట్రోల్ బంకులో తనిఖీలు


పెట్రోల్ బంకులో తనిఖీలు చేస్తున్న డీఎస్‌ఓ మూర్తి

గుమ్మలక్ష్మీపురం: జీసీసీ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురంలో (పి.లేవిడి గ్రామ సమీపంలో) నిర్వహిస్తున్న పెట్రోల్ బంకును సివిల్ సప్లయ్ డీఎస్‌ఓ కేవీఎల్‌ఎస్ మూర్తి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెట్రోల్, డీజిల్ నిల్వలు, నాణ్యత, బంకులో వినియోగదారులకు కల్పించాల్సిన వసతులను పరిశీలించారు. కల్తీ పెట్రోల్, డీజిల్ విక్రయించినా, కొలతల్లో తేడాలు ఉన్నట్లు ఫిర్యాదులు అందినా బంకు యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సీఎస్‌డీటీ కె.సాంబమూర్తి ఉన్నారు.

భూసర్వేలో లోపాలు లేకుండా చర్యలు

పాలకొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వేలో లోపాలు లేకుండా చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని వీఆర్వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా సర్వేపై సమీక్ష చేపట్టారు. ఇప్పటివరకు సర్వే పూర్తయిన గ్రామాల రికార్డులు పరిశీలించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో భూ యజమానులకు భూహక్కు పత్రాలు అందించనున్నామని, వాటిలో తప్పులు లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

ఏనుగుల కదలికలపై అప్రమత్తం

వీరఘట్టం: నడుకూరు, కిమ్మి, చిట్టపులివలస, కొట్టుగుమ్మడ పరిసర ప్రాంతాల్లోని పంట పొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నందున ఆయా ప్రాంతాల రైతులు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌ఓ రవిబాబు కోరారు. ఏనుగులు ఉన్న ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ట్రాకర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఏనుగుల కదలికలను గమనించడంతో పాటు ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా ఎవరూ ఏనుగులను కవ్వించొద్దని కోరారు.

అమ్మవారి పండగకు ఏర్పాట్లు

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో అమ్మవారి పండగ నిర్వహణకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. 64 ఏళ్ల అనంతరం చేపడుతున్న గ్రామదేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని గ్రామస్తులు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామ పెద్దలు, యువత బుధవారం గ్రామంలో పర్యటించి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఆర్థిక స్తోమత ఆధారంగా చందాలను నిర్ణయించి పండగ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 23 నుంచి మే 3 వరకు పండగ చేసేందుకు నిర్ణయించారు.

తాగునీరు అందించండి

సీతంపేట: గిరిజన గ్రామాల్లో వేసవి తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎ.గంగాధర్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. చాలా గ్రామాల్లో ఇప్పటి నుంచే బోర్లు, బావులు అడుగంటుతున్నాయని, రక్షిత పథకాలు కూడా సక్రమంగా పనిచేయని పరిస్థితి నెలకొనడంతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు స్పందించి తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని కోరారు.

చేతి వృత్తిదారులను ప్రోత్సహిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డ్ మేనేజర్ నాగార్జున

పార్వతీపురంటౌన్: చేతి వృత్తిదారులను మరింత ప్రోత్సహిస్తామని నాబార్డ్ మేనేజర్ టి.నాగార్జున అన్నారు. మండలంలోని బుదురువాడ పంచాయతీ సంగందొరవలస గ్రామంలో జరిగిన వెదురు ఉత్పత్తుల శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేతివృత్తిదారులను ప్రోత్సహించేందుకు వెదురుతో బుట్టలు, ఫ్లవర్‌వాజ్‌లు, కూజాలు వంటివి తయారు చేసేందుకు 15రోజుల శిక్షణను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం మేనేజర్, ఐఆర్‌పీడబ్ల్యూఏ డైరెక్టర్ ప్రకాశ్, గిరిజనులు పాల్గొన్నారు.

నేత్ర వైద్యశిబిరం విజయవంతం


నిర్వహిస్తున్న నేత్ర వైద్యశిబిరం

సాలూరు: పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో బుధవారం నిర్వహించిన నేత్ర వైద్యశిబిరం విజయవంతమైంది. 118 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 46 మందికి ఆపరేషన్‌లు అవసరమని పుష్పగిరి కంటి వైద్యులు పేర్కొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్యాంపు కో ఆర్డినేటర్ సురేష్, వర్షిణి,ఆశ్రమ నిర్వాహకురాలు చిన్నమ్మలు తెలిపారు.

సుధాకర్‌ను గెలిపించుకుందాం

- కార్యకర్తలకు ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పిలుపు


జియ్యమ్మవలస: ఎమ్మెల్సీ ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరచిన రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్‌ను గెలిపించే బాధ్యత మనందరిపైన ఉందన్నారు. సామాన్య కార్యకర్త కష్టపడితేనే పార్టీ విజయం సాధిస్తుందన్నారు. పార్టీపరంగా ఓటు నమోదు కార్యక్రమం చేయించడం జరిగిందన్నారు. ఎన్నికల రోజున పోలింగ్ చేయించే బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పోలింగ్ అయ్యేంతవరకు కృషిచేయాలన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఏర్పాటు చేసిన 5 పోలింగ్ బూత్‌లలో 50 మందిని పాయింట్ ఆఫ్ కాంట్రాక్ట్‌గా నియమించి వారికి దిశానిర్దేశం చేయడం జరిగిందన్నారు. అనంతరం ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీపీలు ఉరిటి రామారావు, శెట్టి పద్మావతి, ధీనమయ్య, పార్టీ మండల కన్వీనర్లు మూడడ్ల గౌరీశంకరరావు, ద్వారపురెడ్డి జనార్ధననాయుడు, నాయకులు లోలుగు నారాయణరావు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


భామిని: ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

సుధాకర్ గెలుపునకు కృషిచేద్దాం..

భామిని: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించుకుందామని ఆ పార్టీనాయకులు పిలుపునిచ్చారు. భామిని మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, జేసీఎస్ మండల కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశమయ్యారు. గ్రామాల్లో పట్టభద్ర ఓటర్లను కలిసి సుధాకర్ అభ్యర్థిత్వాన్ని బలపరిచేలా చూడాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులు మజ్జి మోహన్‌బాబు, పాశర్ల రామారావు, భామిని సొసైటీ చైర్మన్ గెల్లంకి రమేష్, ఎంపీటీసీలు కొత్తకోట చంద్రశేఖర్, టింగ అన్నాజీరావు, పార్టీ నాయకులు కొవ్వాడ చిరంజీవులు, బొడ్డేపల్లి ప్రసాద్, గేదెల మోహన్, బిడ్డిక అనంత్ పాల్గొన్నారు.

ఏపీ సీడ్స్‌కు జాతీయ అవార్డు సీఎం కృషి ఫలితమే


అడ్డాకుల చిన్నారావు

గుమ్మలక్ష్మీపురం: ఏపీ సీడ్స్‌కు 'గవర్నెన్స్ నౌ' అవార్డు లభించడం పట్ల మండల అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ అడ్డాకుల చిన్నారావు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ (ఏపీసీడ్స్)కు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డు లభించడం శుభపరిణామమన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు 'గవర్నెన్స్ నౌ' అంతర్జాతీయ సంస్థ గత తొమ్మిదేళ్లుగా ఈ అవార్డులను ప్రదానం చేస్తోందని, ఈ ఏడాదికి గాను పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ యూనిట్స్ కేటగిరిలో ఏపీ సీడ్స్‌కు రెండో సారి ఈ అవార్డు వరించిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రైతులకు ఏపీ సీడ్స్ చేస్తున్న విశేష కృషికి గుర్తింపుగానే ఈ అవార్డు వరించిందన్నారు.

కేంద్రానికి వ్యవసాయరంగంపై అవగాహన లేదు

పాలకొండ రూరల్: వ్యవసాయ రంగంపై చేస్తున్న ఖర్చులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వానికి శాస్త్రీయమైన అంచనాలు, పద్ధతి లేదని అభ్యుదయ రైతు, ఏరువాక సలహామండలి సభ్యుడు కండాపు ప్రసాదరావు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు సాగు ఖర్చుకు మించి మద్దతు ధర అందిస్తామని కేంద్ర ప్రభుత్వం పేర్కొనడం విడ్డూరమన్నారు. సాగు ఖర్చుకు అదనంగా 50 శాతం ఎంఎస్‌పీ ఇవ్వాలని వ్యవసాయ ధరల నిర్ణయ కమిటీ నిర్దేశించినా.. కేంద్రం దీన్ని పరిగణలోకి తీసుకోకుండా రైతులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వ చర్యలతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతు సమస్యలపై స్పందించాలి


మాట్లాడుతున్న అప్పలనాయుడు

పాలకొండ రూరల్: రైతు సమస్యలపై యంత్రాంగం స్పందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను బుధవారం సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజకవర్గంలో మిగులు ధాన్యం కొనుగోలుపై అధికారులు దృష్టి పెట్టాలని కోరారు. రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం సేకరించేలా ఆర్‌బీకేలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని, వెబ్‌సైట్ పనిచేసేలా చూడాలన్నారు. ఆలస్యం కారణంగా దళారులు రైతులను మోసం చేస్తున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని కోరారు. ఆయన వెంట సంఘ నాయకులు కె.రాము, ఇ.రత్ననాయుడు, బీవీ రమణ, పిట్ట రమణ తదితరులున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి


వండవ స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం నాగమణి

వీరఘట్టం: విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను పెంపొందించాలని ఎంఈఓ పత్రి కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని వండవ, వీరఘట్టం బాలికోన్నత పాఠశాలలో బుధవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు. వండవలో తెలుగు సబ్జెక్టుపై, వీరఘట్టంలో మ్యాథ్స్ సబ్జెక్టుపై సమావేశాలను నిర్వహించారు. భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టాలి, గణితంలో మెలకువలను సులువుగా బోధించడం తదితర అంశాలపై చర్చించారు. వండవ కాంప్లెక్ చైర్మన్ కె.పి.నాగమణి, వీరఘట్టం బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం దూసి నాగమణితో పాటు ఆయా మండలాలకు చెందిన తెలుగు, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చాలి

పాలకొండ రూరల్: మండలంలోని గ్రామాల వారిగా సొంత స్థలాలు కలిగి ఉండి గృహాలు నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్నవారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గృహనిర్మాణ శాఖ ఏఈ మాధవరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో వివరాలు సకాలంలో పొందుపర్చటం ద్వారా అర్హులను గుర్తించటం సులభమవుతుందన్నారు. తద్వారా వారు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంతో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకునేందుకు అవకాశం కల్పించినట్లవుతుందన్నారు.

సిబ్బంది క్షేత్రస్థాయిలో వారికి ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఈ ప్రక్రియ పూర్తిచేయాలని సూచించారు.

మహాశివుడికి జలాభిషేకం


కలశాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు


గంగాహారతి సమర్పిస్తున్న వేద పండితులు

భామిని: మండలంలోని బాలేరు వద్ద వంశధార నదీ తీరంలో ధ్యానముద్రలో ఉన్న మహాశివుని విగ్రహానికి భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా మహిళలు కలశాలతో ఊరేగింపుగా వచ్చి మహాశివుడికి జలాభిషేకం చేశారు. వేద మంత్రాలతో గంగమ్మకు మహాహారతి సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ


లిల్లీపుష్పనాథంను పరామర్శిస్తున్న చైర్మన్, ఎంపీపీ

పాలకొండ: ఎన్‌జీఓ సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షుడు, నగరపంచాయతీ పూర్వపు కమిషనర్ లిల్లీపుష్పనాథంను నగరపంచాయతీ చైర్మన్ యందవ రాధాకుమారి, ఎంపీపీ బొమ్మాళి భాను బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలు

జియ్యమ్మవలస: ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశాలకు ఆసక్తి ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చినమేరంగి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామారావు తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు, ఇంటర్మీడియెట్ విద్యను మధ్యలో ఆపేసిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తుతోపాటు పదో తరగతి మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి ఈ నెల 27వ తేదీలోగా కళాశాలలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాల కొరకు చినమేరంగి జూనియర్ కళాశాలలో సంప్రదించాలన్నారు.

విద్యార్థికి గాయాలు

పార్వతీపురం: క్లాస్ వర్క్ చేయలేదని స్కూల్‌లో ఉపాధ్యాయుడు కొట్టడంతో ఒక విద్యార్థికి గాయాలయ్యాయి. ఈ మేరకు పార్వతీపురం ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురంలోని గృహప్రియానగర్‌కు చెందిన పోల భానుప్రకాష్ స్థానిక సురేష్ స్కూల్‌లో ఆరవ తరగతి చదువుతున్నాడు. ఈనెల 1 నుంచి 4 వ తేదీవరకు ఆరోగ్యం బాగా లేదని స్కూల్‌కు వెళ్లలేదు. ఆరోగ్యం బాగాలేదని, నీరసంగా ఉండడంతో క్లాస్ వర్క్, హోంవర్క్ చేయలేదు. హోంవర్క్ చేయకపోవడంతో క్లాస్ టీచర్ రవికిరణ్ కుడి చేయి భుజంపై గట్టిగా కొట్టారు. దీంతో ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు చెప్పడంతో చికిత్సకోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ


తెలుగు సబ్జెక్టు బోధనలో మెలకువలు తెలియజేస్తున్న ఉపాధ్యాయుడు

బలిజిపేట: బలిజిపేట, సీతానగరం మండలాలకు చెందిన తెలుగు స్కూల్ అసిస్టెంట్స్‌కు పెదపెంకి ఉన్నత పాఠశాలలో తెలుగు సబ్జెక్టుపై శిక్షణ తరగతులు బుధవారం ఇచ్చారు. స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.రామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెండు మండలాలకు సంబంధించి 27మంది ఉపాధ్యాయులకు శిక్షణకు హాజరయ్యారు. తెలుగు సబ్జెక్టు బోధనలో ఉండే మెలకువలను ఉపాధ్యాయులకు శిక్షణలో వివరించారు. తెలుగు పాఠ్యాంశాలు విద్యార్థులకు సులువైన పద్ధతిలో బోధించే అంశాలపై వారికి శిక్షణ ఇచ్చినట్టు చైర్మన్ రామారావు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

25న వాహనాల వేలం

సాలూరు: వివిధ కేసులలో సీజ్‌చేసిన 7వాహనాలకు ఈ నెల 25 ఉదయం 10.30 గంటలకు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద వేలంపాట నిర్వహించనున్నట్లు పట్టణ ఎస్సై పాపారావు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ సుధాకర్‌రావు పర్యవేక్షణలో 4 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలకు వేలం వేయనున్నామన్నారు. ఆసక్తి గల వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

మునగ మొక్కల పంపిణీ


మునగ మొక్కలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస గ్రామంలో ఉపాధిహామీ పథకం వేతనదారులకు ఎంపీడీఓ జి.పైడితల్లి మునగ మొక్కలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో మొదటి విడతగా 5వేల మునగ మొక్కలను ఉపాధిహామీ వేతనదారులకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. వేతనదారులు వాటిని వారి ఇంటి పెరట్లో, సొంత స్థలాల్లో నాటుకొని పెంచాలన్నారు. మునగ ఆకులు, కాయలు ఆహారంగా తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జీఎల్‌పురం విద్యార్థి


శ్రీచరణ్

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాయ్స్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలకు గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న పాలక శ్రీచరణ్ ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.వైకుంఠరావు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ..2022 డిసెంబర్‌లో విజయనగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో జరిగిన జిల్లాస్థాయి సెలక్షన్స్‌లో శ్రీచరణ్ ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభకనబరిచినట్లు చెప్పారు. ఈనెల 23 నుంచి మచిలీపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ చాంపియన్ షిప్ పోటీల్లో విద్యార్థి పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న శ్రీచరణ్‌ను పాఠశాల హెచ్ఎం బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధి వేతనదారుల సంఖ్య పెరగాలి


సిబ్బందికి సూచనలిస్తున్న ఏపీడీ శ్రీహరి

గరుగుబిల్లి: ఉపాధిహామీ పథకంలో వేతనదారుల సంఖ్యను పెంచాలని ఏపీడీ(సీతంపేట) జి.శ్రీహరి అన్నారు. మండలంలోని సుంకి, ఉల్లిభద్ర పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు పంచాయతీల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు పూటలా పనుల్లో పాల్గొనేలా వేతనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మస్తర్లు నమోదు చేయాలన్నారు. వేతనదారుల ఆధార్ నంబర్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కొత్త నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏపీఓ టి.రామకృష్ణనాయుడు, ఈసీ వైఆర్‌డీ ప్రసాద్, టీఏలు ఎస్.పద్మావతి, ఎం.ఉమామహేశ్వరరావు, భూలక్ష్మి, నిర్మల, నరసింహంతోపాటు పలువురు క్షేత్రసహాయకులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ ఏర్పాట్లపై చర్చ


సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో ఉమాసహిత కైలాసనాథస్వామి దేవాలయం 40వ వార్షికోత్సవ నిర్వహణపై ఆలయ కమిటీ సభ్యులు బుధవారం చర్చించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు, సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ అధ్యక్షుడు కొత్తకోట విష్ణు, సభ్యులు సురేష్, పైడా నాగేశ్వరరావు, మద్ది దొరబాబు పాల్గొన్నారు. మార్చి 17 నుంచి ఐదు రోజుల పాటు ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లుపై చర్చించారు. మరోసారి గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించేందుకు తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ నిమ్మక శేఖర్, మాజీ సర్పంచ్ పాలక ప్రేమానంద్, కమిటీ సభ్యులు కె.సూర్యం, గణేష్, వైస్ సర్పంచ్ కొత్తకోట కిషోర్ తదితరులున్నారు.

కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు


కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఎం నేతల నిరసన

కురుపాం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్ వలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ, కొల్లి సాంబమూర్తి, గంగునాయుడు నాయుడు విమర్శించారు. కురుపాం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా బుధవారం నిరసన తెలియజేశారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రావాడ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడ్జెట్‌లో రైతులకు కేంద్రం వాత పెట్టిందని, పంటలకు కనీస మద్దతు ధర కేటాయింపు లేదని, మోడీ ప్రభుత్వం దేశాన్ని అప్పుల ఊబిలోకి నెడుతోందని మండిపడ్డారు. ఇది రైతు, ఎస్సీ, ఎస్టీ, కార్మిక ప్రజా వ్యతిరేక బడ్జెట్‌గా పేర్కొన్నారు.

సర్కారు వైద్యాన్ని ప్రజలకు చేరువచేయండి


మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరమణనాయుడు

వీరఘట్టం: సర్కారు వైద్యాన్ని ప్రజలకు చేరువచేయాలని ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు అన్నారు. బిటివాడ పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతీ ఇంటికి వైద్య సేవలను అందిస్తోందని, ఆరోగ్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆస్పత్రి అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి, తీర్మానాలు చేశారు. సమావేశంలో వైద్యులు ఎ.మానస, ఎస్.నితీష, బిటివాడ, వండవ సర్పంచ్‌లు ఎస్.నర్సింహులునాయుడు, మిడితాన కల్యాణి, నీలం సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ అభివృద్ధికి చర్యలు

పాలకొండ రూరల్: డివిజన్ కేంద్రం పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయించినట్లు సంబంధిత శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) టీవీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం రాత్రి స్థానిక కాంప్లెక్స్‌ను ఆయన సందర్శించి, ఇక్కడి వసతులపై ఆరా తీశారు. ప్రయాణికులతో మాట్లాడి వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు.

పార్వతీపురం మన్యం జిల్లాలో ఆర్టీసీ సేవలు మరింత విస్తృతం చేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక క్లాంప్లెక్స్‌లో పడమర దిశలో మరో మూడు నూతన ఫ్లాట్‌ఫాంలు నిర్మించాలని నిర్ణయించారు. దీని వల్ల మరిన్ని సర్వీసులు పెంచేందుకు వెసులబాటు కలుగుతుందన్నారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కురుపాం:

ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని ఎంపీపీ శెట్టి పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, సర్పంచ్ గార్ల సుజాత అన్నారు. మంతినివలస గ్రామ సమీపంలో ఎటర్నల్ లైట్ ట్రస్టు ఆధ్వర్యంలో కమ్యూనిటీ బోరు వెల్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా సుమారు లక్ష రూపాయిల వ్యయంతో ఏర్పాటు చేసిన మంచినీటి బోరును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ప్రజాహిత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో వైద్యశిబిరాలు, సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు వెన్నా విజయ్, కన్వీనర్ ఎస్.ప్రసంగి మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా ఏజన్సీలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి ఉచితంగా బోర్లు తవ్విస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆదిల్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారి ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, సంస్థ కార్యదర్శి జి.రామారావు, రంజిత్‌కుమార్ లీమా, జాన్, జి.పాల్, కె.ఎస్.రావు, రాజారావు, శ్రీను, వెంకటరావు పాల్గొన్నారు.